# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- కృష్ణా జిల్లాలో గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహంలో రహస్య కెమెరాల ఘటనకు సంబంధించిన బాధ్యులను శిక్షిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.
- పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా విద్యా కమిటీలు కీలక పాత్ర పోషించాలని మంత్రి నారా లోకేష్ కోరారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు వనమహోత్సవం కార్యక్రమం జరిగింది.
- బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఉన్న ఎకో పార్కులో ఈ రోజు నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఏటా కనీసం రెండు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాలు పెరగాలంటే ఇంకుడు గుంతలు ఏర్పాటు చాలా అవసరమని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వసతి గృహంలో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసిన ఘటన మీద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర విచారణకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్ లో మాట్లాడి విచారణ జరుగుతున్న విధానం గురించి వాకబు చేశారు. ఈ ఘటన విషయంలో తల్లితండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి పేర్కొంటూ... తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా జిల్లాలో గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహంలో రహస్య కెమెరాల ఘటనకు సంబంధించి బాధ్యులు ఎంతటివారైనా సరే వదిలిపెట్టేది లేదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విద్యార్థినులకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్ రావుతో కలసి కళాశాల వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ నిరసన కొనసాగిస్తున్న విద్యార్థులతో మంత్రి రవీంద్ర మాట్లాడారు. కళాశాల విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి సంరక్షణ కల్పిస్తామన్నారు. అదే విధంగా ఈ సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వసతి గృహం వార్డెన్ గాని, కళాశాల యాజమాన్యంపై గాని క్రమశిక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఈ ఘటన మీద విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హోమ్ మంత్రి వంగలపూడి అనిత కూడా స్పందించారు. బాధ్యులపైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా విద్యా కమిటీలు క్రియాశీలకంగా వ్యవహరించాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. విశాఖ జిల్లా భీమిలిలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఈ రోజు మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రత్యేకమైన యాప్ ద్వారా విద్యాకమిటీల నుంచి పాఠశాలల స్థితిగతుల మీద ఎప్పటికపుడు వివరాలు తీసుకుంటామని తెలిపారు. ఆయా పాఠశాలల ర్యాంకింగ్స్ ను ఆన్ లైన్ పెడతామని అన్నారు. అదే విధంగా అంతర పాఠశాలల క్రీడా పోటీలను, సైన్స్ ఫేర్ లను నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. కాగా, ఈ సందర్భంగా భీమిలి కస్తూరిబా పాఠశాలలో సౌకర్యాలపై విద్యార్థినులను నారా లోకేష్ అడిగి తెలుసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలో కూడా రహదారులను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా కాణిపాక వరసిద్ధి వినాయకున్ని మంత్రి ఈ రోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో చాలా చోట్ల రోడ్లు సరిగ్గా లేవని చెప్పారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని అన్నారు. ఈ రోడ్లను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ "గ్రామ సడక్ యోజన" నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులను కలిపి త్వరలోనే కొత్తగా రోడ్లను నిర్మించడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కర్నూలు జిల్లాలో పత్తికొండ మండలం, పుచ్చకాయలమడ గ్రామంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు రానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి. బిందు మాధవ్ ఈరోజు ఓర్వకల్లు విమానాశ్రయం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏడాదికి పది శాతం మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ పచ్చదనంతో పరిఢవిల్లుతుందని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వనమహోత్సవం- కార్యక్రమంలో భాగంగా ఈ రోజు అనకాపల్లిలోని మార్కెట్ యార్డ్ లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లాలో అటవీ విస్తీర్ణాన్ని 50 శాతంగా పెంచడానికి సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నగరంలో ఈ రోజు మంత్రి మొక్కలను నాటారు. అలాగే విజయనగరం జిల్లాలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర చిన్నపరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 50 శాతం పచ్చదనం తీసుకురావాలంటే ప్రతి రోజు మొక్కలు నాటే కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంపై ఏర్పడిన అల్పపీడనం ఉత్తర ఆంధ్రప్రదేశ్ దక్షిణ ఒడిశా ప్రాంతంపై బలపడి తీవ్ర అల్పపీడనంగా మారిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న 36 గంటల్లో అదే ప్రాంతంలో వాయుగుండంగా మారుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కోస్తాంధ్ర అంతటా ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కూరుస్తాయని, కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 16 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆకాశావాణి విశాఖపట్నం కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్, క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. అదేవిధంగా క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టుకు రెడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ, లేదా డిప్లమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. ధరఖాస్తులను సిరిపురంలోని ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రానికి పోస్టల్ ద్వారా సెప్టెంబరు 3వ తేదీలోగా పంపించాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తుపాను కారణంగా భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో నగర ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) కమిషనర్ పి.సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పలు విభాగాధిపతులను అప్రమత్తం చేస్తూ.. ఈ రోజు ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో ప్రస్తుతం భారీ వర్షాలు పడుతున్నందున జివిఎంసి అదనపు అడిషనల్ కమిషనర్-1 పర్యవేక్షణలో కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌లో 24 గంటలు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగాధిపతులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కొండవాలు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కమిషనర్ కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణానది పరివాహిక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఈ జలాశయం నుంచి 10 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =